## ప్రజల మాట ప్రగతి బాట

## అందోల్ / జహీరాబాద్/ నారాయణఖేడ్ నియోజకవర్గాలు

# కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ చీకటే

- బీఆర్‌ఎస్ గెలుపును ఏ శక్తీ అడ్డుకోలేదు
- గ్రామాల్లో ప్రజాఆశీర్వాద సభలు
- కాంగ్రెస్‌వి అమలు కాని హామీలు
- ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే మాణిక్‌రావు

### మీ బాధ్యత నాది, నా బాధ్యత మీదే

ఝరాసంగం, అక్టోబర్29: కాంగ్రెస్ ఇచ్చే ఆరు గ్యారెంటీలకు ఎవరు గ్యారెంటీ అని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రశ్నించారు. ఆదివారం మండలంలోని కొల్లూరు, తుమ్మన్‌పల్లి, కప్పాడ్, సంఘం(కె), నర్సాపూర్, కంబల్‌పల్లి, గుంతమర్పల్లి, జొన్నగావ్, ప్యారవరం, బొప్పనపల్లి గ్రామాల్లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, సుడా చైర్మన్ ఉమాకాంత్ పాటిల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మరోసారి గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే మాణిక్‌రావు నిర్వహిస్తున్న ప్రచారానికి గ్రామ గ్రామాన ఘనస్వాగతం పలుకుతూ ప్రజలనుంచి మద్దతు లభించింది. మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించి అభివృద్ధిని కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, అవి కొనసాగాలంటే రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మళ్లీ రావాలన్నారు. జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఎమ్మెల్యే అభ్యర్థులు లేక వికారాబాద్ నుంచి తీసుకొచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చే ఆరు గ్యారెంటీలు అమలుకు సాధ్యం కానివని, వాటిపై ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం అరిగోస పడ్డారని గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించారని పేర్కొన్నారు. పలు గ్రామాల నుంచి కాంగ్రెస్‌ను వీడి ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకటేశం, సర్పంచులు, జగదీశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, పరమేశ్వర్ పాటిల్, కృష్ణ, ఫారుఖ్ పాటిల్, ఎంపీటీసీలు, విజేందర్‌రెడ్డి, సంతోష్‌పాటిల్, బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు సభాశ్‌రావు పాటిల్, హఫీజ్ పహిల్వాన్ పాల్గొన్నారు.


ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మాణిక్‌రావు


బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన కప్పాడ్ గ్రామస్తులు

**మాణిక్‌రావు గెలుపు ఖాయం**

కోహీర్, అక్టోబర్ 29 : జహీరాబాద్ ఎమ్మెల్యేగా మాణిక్‌రావు మరోసారి కచ్చితంగా గెలుస్తారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని మద్రి, గురుజువాడ, రాజనెల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం కవేలిలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మరోసారి గెలిపిస్తాయన్నారు. మండలంలో బీఆర్‌ఎస్ ప్రచారానికి అపూర్వ స్పందన లభిస్తున్నదని చెప్పారు.

## నేడు న్యాల్‌కల్‌లో మంత్రి హరీశ్‌రావు పర్యటన

న్యాల్‌కల్, అక్టోబర్ 29 : న్యాల్‌కల్ గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు రానున్నారని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఈదులపల్లి శివకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక గ్రామంలో మంత్రి హరీశ్‌రావు పర్యటన ఏర్పాట్లను మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా సాయంత్రం 5 గంటలకు స్థానిక గ్రామ ప్రధాన చౌరస్తాలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించనున్నారన్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరనున్నారన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కర్నర్ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగించనున్నారన్నారు. కార్యక్రమానికి మండలంలోని పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీందర్, వైస్ ఎంపీపీ గౌసొద్దీన్, మండల నాయకులు పాండురంగా రావుపాటిల్, భాస్కర్, బస్వరాజ్‌పాటిల్, నర్సింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్, వెంకట్, ఇసాంపటేల్, సత్యనారాయణ, శివస్వామి, షబ్బీర్‌ఖాన్, రఫీయొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి హరీశ్‌రావు సమావేశం

జహీరాబాద్, అక్టోబర్ 29 : రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సోమవారం సాయంత్రం జహీరాబాద్ రానున్నారని ఎమ్మెల్యే మాణిక్‌రావు, పార్టీ సమన్వయ కర్త దేవీప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తన్వీర్ ప్రకటనలో తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని పీవీఆర్ గార్డెన్‌లో ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్‌లెవల్ నాయకులతో సమావేశం ఉంటుందన్నారు. సాయంత్రం ఆరు గంటలకు నిర్వహించే సమావేశానికి ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావాలని వారు సూచించారు.

## క్రాంతికిరణ్ గెలుపు కోసం కృషి చేస్తాం

చౌటకూర్, అక్టోబరు 29: అందోలు అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే క్రాంతికిరణ్ గెలుపు కోసం అందరం కృషి చేస్తామని బీఆర్‌ఎస్ యువత విభాగం మండల అధ్యక్షుడు విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటకిష్టాపూర్, లింగంపల్లి, వెండికోల్ గ్రామాల్లో ఆదివారం యువకులతో సమావేశం నిర్వహించారు. రెండో పర్యాయం కూడా భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే క్రాంతికిరణ్ గెలుపునకు దోహదపడుతాయన్నారు. అందోలు గడ్డపై గులాబీ జెండా ఎగురవేసి సత్తా చాటాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యువత నాయకులు బసంత్‌రెడ్డి, సునీల్, శ్రీశైలం, అఖిల్, నర్సింగ్‌రావు, కుమార్ పాల్గొన్నారు.

## మామిడిపల్లిలో బీఆర్‌ఎస్‌లో చేరికలు

రాయికోడ్, అక్టోబర్ 29 : కాంగ్రెస్ నాయకులు ఎన్ని గ్యారెంటీలు ప్రకటించినా తెలంగాణలో వారికి వారంటీ లేదని జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్ అన్నారు. ఆదివారం మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రాయికోడ్ ఏఎంసీ డైరెక్టర్ మహబూబ్‌పాటిల్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అన్ని వర్గాలకూ సీఎం కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. సమావేశంలో సర్పంచ్ సలీం, పార్టీ అధ్యక్షుడు కైసర్‌పాటిల్, ఏఎంసీ డైరెక్టర్ మహబూబ్‌పాటిల్ నాయకులు ప్రశాంత్‌పాటిల్‌లు ఉన్నారు.


కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్

## ఎన్నికల నిబంధనలు పాటించాలి

జహీరాబాద్, అక్టోబర్ 29 : జహీరాబాద్ నియోజకవర్గంలో రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను పాటించాలని ఎన్నికల అధికారి రెడ్డి తెలిపారు. ఆదివారం జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. నామినేషన్ ప్రక్రియకు ఆర్వో కార్యాలయంలో ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు నూతన ఓటర్లు నమోదుకు అవకాశం ఉందన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో 313 పోలింగ్ బూత్‌లు ఉండగా, అల్లీపూర్‌లో ఓటర్లు అధికంగా ఉండటంతో అదనంగా ఒక బూత్ ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో అవసరమైన వాహనాల కోసం రిటర్నింగ్ అధికారుల వద్ద అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, తహసీల్దార్లు రవీందర్, సంజీవ్‌రావు, బీజేపీ, బీఎస్పీ, ఎంఐఎం నాయకులు మల్లికార్జున్ పాటిల్ ఉన్నారు.

# కాంగ్రెస్‌లో రెండు వర్గాలు

**అభ్యర్థి చంద్రశేఖర్ సమక్షంలో విభేదాలు**

కోహీర్, అక్టోబర్ 29 : కాంగ్రెస్ నాయకుల్లో విభేదాలు బట్టబయలయ్యాయి. రెండు వర్గాల మధ్య మాటల యుద్ధం నడిచింది. ఆదివారం మండలంలోని వెంకటాపూర్‌లో ప్రచారం నిర్వహించేందుకు కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ నిర్ణయించారు. కానీ గ్రామంలో ఆయనకు స్వాగతం పలికేందుకు రెండు గ్రూపులు తయారయ్యాయి. ఓ గ్రూపులో మాజీ సర్పంచులు మల్లికార్జున్, అంజయ్య, మాజీ ఎంపీటీసీ అశోక్ ఉన్నారు. మరో వైపున ప్రభాకర్‌రెడ్డి తయారయ్యాడు. రెండు వర్గాల నాయకులు వేర్వేరుగా డీజే సౌండ్ సిస్టం, భోజనాలు ఏర్పాటు చేశారు. తమ గ్రామానికి సాయంత్రం మూడు గంటలకు చంద్రశేఖర్ వస్తున్నాడని ప్రభాకర్‌రెడ్డి తన మద్దతుదారులతో కలిసి స్వాగతం పలికేందుకు జాతీయ రహదారి వద్దకు బయలుదేరగా, ఆగ్రహం చెందిన మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు కార్యకర్తల మధ్య చిచ్చులేపారు. మాజీ ఎంపీటీసీ అశోక్ స్పందిస్తూ రెండు వర్గాలు ఉంటే తమ గ్రామంలో అసలు కాంగ్రెస్ ప్రచారం అవసరం లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ అతడికి నచ్చజెప్పేందుకు యత్నించారు. కానీ అతడు ఒప్పుకోలేదు. తమ గ్రామంలో రెండు వర్గాలను తయారు చేసింది పార్టీ మండల అధ్యక్షుడు రామలింగారెడ్డి అని అందరి ముందు గట్టిగా చెప్పారు. రెండు గ్రూపులకు జెండాల పంపిణీ, రెండు స్థలాల్లో భోజనాలు ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహించారని నిలదీశారు. గ్రామ నాయకులు వర్గాలుగా విడిపోయి గొడవలు పెట్టుకొంటే పార్టీకి నష్టం జరుగుతుందని తనకు సహకరించాలని పనిచేయాలని కోరారు.


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కార్మికులు

## బీఆర్‌ఎస్‌లో చేరిన కార్మికులు

జహీరాబాద్, అక్టోబర్ 29 : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై 300 మంది భవన నిర్మాణ కార్మికులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తన్వీర్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు అరుణ్, శ్రీకాంత్‌రెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో మంకాల్ సుభాష్, మోతీరాం, యూనిస్, రాములునేత, మజర్, అక్రమ్ పాల్గొన్నారు.

## గడప గడపకూ బీఆర్‌ఎస్ ప్రచారం

మునిపల్లి, అక్టోబర్ 29: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ నాయకులు మండలంలోని గ్రామాల్లో గడప..గడపకు వెళ్లి ప్రజలకు అర్థం అయ్యే విధంగా వివరిస్తున్నారు...ఆదివారం మండలంలోని మన్సన్‌పల్లి, తాటిపల్లి గ్రామాల్లో మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరుతుంటే ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందన్నారు. 60సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు చెయ్యని అభివృద్ధిని అతి తక్కువ కాలంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందన్నారు. ఇంటింటి ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు చాయ్ హోటల్‌లో చాయ్ పోస్తూ.. చికెన్ దుకాణాల్లో చికెన్ నరుకుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాయికుమార్, శివశంకర్, మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శశికుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణ పాల్గొన్నారు.

## మరోసారి అవకాశమివ్వండి


హన్మంత్‌రావుపేట్‌లో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

నారాయణఖేడ్, అక్టోబర్ 29 : మండలంలోని లింగాపూర్ హన్మంత్‌రావుపేట్, లింగనాయక్‌పల్లి, మాద్వార్, మాద్వార్ తండా తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. గత కాంగ్రెస్ పాలనలో ప్రస్తుత కేసీఆర్ ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకుని ఎన్నికల్లో తీర్పు చెప్పాలన్నారు. గత కాంగ్రెస్ పాలనలో ప్రతి పథకాన్ని అవినీతిమయం చేసి ఆపార్టీ కార్యకర్తలు పథకాలను పక్కదారి పట్టించిన విషయాన్ని గుర్తు చేసిన ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం నేరుగా లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చే దిశగా పారదర్శకంగా పథకాలను అమలు చేస్తుందన్నారు. నారాయణఖేడ్‌లో మూడవసారి గులాబీ జెండాను ఎగురవేయాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పరమేష్, సర్పంచ్‌లు దత్తు, సతీశ్, రాజునాయక్, నాయకులు రమేశ్‌చౌహాన్, ప్రభాకర్, సత్యపాల్‌రెడ్డి, అంజాగౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

## ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి

రాయికోడ్, అక్టోబర్ 29 : దళితుల ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఏర్పాటు చేసిన మండల దళిత ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే క్రాంతికిరణ్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ నెల 31న పుల్‌కల్ మండలంలో జరిగే అందోల్ నియోజకవర్గ దళిత ఆశీర్వాద సభకు రాయికోడ్ మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సింగితం ఎంపీటీసీ నిరంజన్ సర్పంచ్‌లు శంకర్, కృష్ణ, మాజీ ఎఎంసీ చైర్మన్ మారుతి, వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.